# వాంకిడి విద్యార్థి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, ఉద్యోగం

## గురుకులాల్లో కుట్రల వెనుక ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హస్తం

### సచివాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి కొండా సురేఖ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 29:** రేవంత్ రెడ్డి పాలనను కొందరు అడ్డుకోవాలని చూస్తున్నారని, ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నారని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. గురుకులాల్లో కుట్రల వెనుక ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హస్తం ఉందని మంత్రి వ్యాఖ్యానించారు. శుక్రవారం సచివాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఆయన గురుకులాల కార్యదర్శిగా ఉన్నారని, ఆ సమయంలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఆయన అనుచరులను సిబ్బందిగా నియమించుకున్నారని ఆమె ఆరోపించారు. ఇప్పుడు వారి ద్వారానే ప్రభుత్వంపై బురదజల్లేలా కుట్రలు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకుల కార్యదర్శిగా ఉన్న సమయంలో భారీగా నిధుల దుర్వినియోగం జరిగిందని ఆమె ఆరోపించారు. అవినీతి ఆరోపణలు వచ్చాకే ఆయన్ను కార్యదర్శిగా తొలగించారని ఆమె అన్నారు. ఈ విషయాన్ని వదలబోమని సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షిస్తామన్నారు. వాంకిడిలో చనిపోయిన విద్యార్థి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, ఒక ఉద్యోగం ఇస్తున్నామని ఆమె తెలిపారు. గురుకుల విద్యార్థిని మరణాన్ని రాజకీయ లబ్ధికోసం ఉపయోగించుకోవాలని చూస్తున్నామన్నారు. తమ ప్రభుత్వంలో ఇది మొదటి సంఘటన అని, చాలా బాధగా ఉందన్నారు. నిమ్స్‌లో చికిత్స పొందిన అమ్మాయికి స్పెషల్ ట్రీట్‌మెంట్ ఇచ్చామని, కానీ, ఆమె చనిపోయిందన్నారు. గత ప్రభుత్వంలో ఎవరైనా చనిపోతే ఆదుకున్నారా? అంత బాధ మీకు ఉంటే ఆ అమ్మాయి కుటుంబానికి కోటి రూపాయలు ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వంలో చాలా సంఘటనలు జరిగాయని, కానీ, ఒక్కసారి కూడా అక్కడికి వెళ్లలేదన్నారు. తమ ప్రభుత్వంలో ఫుడ్ పాయిజన్ ఘటనకు బాధ్యులు అయిన అధికారులను కూడా సస్పెన్షన్ చేశామన్నారు. ఫుడ్ పాయిజన్ వెనుక ఒక అదృశ్య శక్తి పనిచేస్తుందని మంత్రి తెలిపారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ చేస్తున్నామన్నారు. ప్రభుత్వాన్ని నడవకుండా చేయాలని ఒక ప్రణాళికతో డ్రామాలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. లగచర్లలో కలెక్టర్‌ను హత్య చేయాలని చూశారని మంత్రి ఆరోపించారు. బిఆర్ఎస్ నాయకులు మల్లన్నసాగర్ భూ నిర్వాసితుల ఉసురు తీసుకోలేదా అంటూ మంత్రి ప్రశ్నించారు. గతంలో మహబూబాబాద్‌లో గిరిజనులను కొట్టించి మళ్లీ అక్కడ మహా ధర్నా ఎలా చేస్తారని ఆమె ప్రశ్నించారు.

# ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు గుడ్‌న్యూస్

## 5శాతం ఐఆర్ మంజూరుచేస్తూ సర్కార్ ఉత్తర్వులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 29 :** ప్రభుత్వ రంగ సంస్థలు, సొసైటీలు, యూనివర్సిటీల ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లతో సమానంగా మధ్యంతర భృతిని ప్రకటించింది. మూలవేతనంలో 5 శాతం ఐఆర్ మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, స్థానిక సంస్థల ఉద్యోగులకు గతేడాది అక్టోబరు 2న ఐఆర్ మంజూరు చేసింది. తమకు కూడా మధ్యంతర భృతి ఇవ్వాలని ప్రభుత్వ రంగ సంస్థలు, సహకార సొసైటీలు, యూనివర్సిటీల్లో పనిచేసే నాన్ టీచింగ్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. అంగీకరించిన ప్రభుత్వం వారికి కూడా ఐఆర్ వర్తింపచేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



# బిర్సాముండా మునిమనుమడు మంగళ్‌ముండా కన్నుమూత

**రాంచి, నవంబరు 29:** గిరిజనుల ఆరాధ్యదైవం బిర్సా ముండా మునిమనుమడు మంగళ్‌ముండా గుండెపోటుతో చనిపోయారు. 45 ఏళ్ల వయసున్న మంగళ్‌ముండా కార్డియో వాస్కులర్ వైఫల్యం వల్లనే చనిపోయారని రాజేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) ప్రకటించింది. ఈనెల 25వ తేదీ జార్ఖండ్‌లోని కుంతిజిల్లాలో రోడ్డుప్రమాదానికిగురికావడంతో మంగళ్‌ముండాను రిమ్స్‌లో చేర్చారు. ఒకప్యాసింజర్ వాహనం కిందపడిపోవడంతో ముండాకు తీవ్ర గాయాలయ్యాయి. తలకు బలమైన గాయాలుతగలడంతో రిమ్స్‌కు తక్షణ చికిత్సకోసం తరలించారు. అత్యవసరచికిత్స విభాగంలో ఆయన్ను చేర్చి చికిత్స చేస్తున్నారు. చికిత్సలో ఉండగానే గుండెపోటుకు గురికావడంతో మృతిచెందారు. ఆయన మరణాన్ని రిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. హేరేన్ బిరువా ధృవీకరించారు. బిర్సా ముండా బంధువు మంగళ్‌ముండా కార్డియో వాస్కులర్ వైఫల్యం వల్ల రాత్రి 12.30 గంటలకు కన్నుమూసారని ప్రకటించారు. ఆయన్ను వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స చేసామని, తీవ్రంగా గాయపడిన ఆయన కోలుకుంటున్న తరుణంలోనే గుండెపోటుకు గురయ్యారని ఆసుపత్రి సూపరింటెండెంట్ తెలిపారు.

# అరకోటి పేద కుటుంబాల్లో గృహజ్యోతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 29:** విద్యుత్తు రంగంలో పదేండ్ల విధ్వంసానికి ప్రజా ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. విద్యుత్తు సంస్థల పేరిట రూ.83 వేల కోట్ల అప్పులు చేసి ఆస్తులన్నీ తాకట్టు పెట్టిన దుస్థితి నుంచి తెలంగాణ మళ్లీ తలెత్తుకునే నిర్ణయాలు తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. రైతులకు, నిరుపేదలకు లాభసాటిగా ఉండే పథకాలను కొనసాగిస్తూనే విద్యుత్తు రంగాన్ని పునరుద్ధరించే ప్రజా ప్రభుత్వం ప్రయత్నం చేసిందని తెలిపింది. ట్రాన్స్కో, జెన్కోతో పాటు డిస్కంలు.. విద్యుత్తు సంస్థన్నింటా దుబారాను తగ్గించి విద్యుత్తు ఉత్పత్తి సామర్థం పెంచేందుకు అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. భవిష్యత్తు విద్యుత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో కొత్త పునరుజ్జీవ ఇందన విధానం (రెన్యూవబుల్ ఎనర్జీ పాలసీ) రూపొందిస్తోంది.

దివాళా బాటలో ఉన్న విద్యుత్తు సంస్థలను గాడిలో పెట్టేందుకు తొలి ఏడాదిలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మక విధానాలు అనుసరించింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి భారీ అప్పులు, వేల కోట్ల నష్టాలతో విధ్వంసమైన తీరుపై శ్వేతపత్రం విడుదల చేశారు. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్తు కేంద్రాల నిర్మాణం, గతంలో జరిగిన విద్యుత్తు కొనుగోళ్లలో జరిగిన అవకతవకలపై విచారణకు ప్రభుత్వం జ్యుడిషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది.

> ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత కరెంట్
>
> వ్యవసాయానికి నిరాటంకంగా ఉచిత విద్యుత్తు
>
> దేశంలోనే గరిష్ట విద్యుత్తు డిమాండ్‌లో రికార్డు
>
> విద్యుత్తు ఉత్పత్తి సామర్థం, పునరుత్పాదక విద్యుత్తుపై ఫోకస్
>
> విద్యుత్తు రంగంలో కొత్త విప్లవం

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు పథకాన్ని నిరాటంకంగా కొనసాగించింది. రైతుల సంక్షేమమే లక్ష్యంగా తొలి ఏడాదిలోనే రూ. 10,444 కోట్లు ఉచిత విద్యుత్తు సబ్సిడీ భారాన్ని భరించింది. దాదాపు 29 లక్షల మంది రైతులు ఉచిత కరెంట్ ద్వారా లబ్ధి పొందారు. గత పదేండ్లలో దాదాపు రూ.20 వేల కరెంటు ఛార్జీల మోత మోసిన ప్రజలకు ప్రజా ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది.

కరెంట్ ఛార్జీలను పెంచకుండా రాష్ట్రంలో 1.85 కోట్ల మంది వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసింది. ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం గృహజ్యోతి పథకాన్ని ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసింది. 200 యూనిట్లలోపు విద్యుత్తు వాడే వినియోగదారులకు విద్యుత్తు అందిస్తోంది. మార్చి నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 50 లక్షల కుటుంబాలు జీరో బిల్లులు అందుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విద్యా సంస్థలన్నింటికీ ఉచిత విద్యుత్తు అందించే మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 39,067 విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్తును అందిస్తోంది. దీనికి ప్రభుత్వం రూ. 101.57కోట్ల సబ్సిడీ విడుదల చేసింది. రోజువారీ అత్యధిక విద్యుత్తు డిమాండ్లో తెలంగాణ చరిత్రలోనే మొదటిసారిగా పెద్ద రాష్ట్రాలను సైతం అధిగమించింది. గత ఏడాది 2023 ఆగస్టులో గరిష్ఠ విద్యుత్తు డిమాండ్లో ఎనిమిదో ర్యాంకులో ఉన్న తెలంగాణ రాష్ట్రం ఈ ఏడాది అయిదో ర్యాంకుకు చేరింది.

తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 15,623 మెగావాట్ల ఆల్ టైమ్ హై పీక్ డిమాండ్ విద్యుత్తును సమర్థంగా సరఫరా చేసి కొత్త రికార్డు నెలకొల్పింది.

గత ప్రభుత్వపు అనాలోచిత నిర్ణయాలతో ఏళ్లకేళ్లు ఆలస్యమైన యాదాద్రి థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం పనులను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. మొదటి దశలోని రెండు యూనిట్ల నిర్మాణ పనులు ఇటీవలే పూర్తయ్యాయి. సెప్టెంబర్ 12న యూనిట్ 1, 2 గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. ప్రజా విజయోత్సవాల్లో భాగంగా 800 మెగావాట్ల ఒక యూనిట్లో వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించ నున్నారు. దేశంలోనే వినూత్నంగా మహిళా శక్తి సంఘాల అధ్వర్యంలో 4000 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఒక్కో సంఘం అధ్వర్యంలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఒక్కో మెగావాట్ ఉత్పత్తి అయ్యేలా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది.

పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలో ఎంపిక చేసిన అయిదు గ్రామాల్లో నూటికి నూరు శాతం సౌర విద్యుత్తు వినియోగించే మోడల్ ప్రాజెక్టును చేపట్టింది. రెప్పపాటు కోత లేకుండా నిరంతరాయంగా విద్యుత్తు అందించేందుకు, ఎక్కడైనా సాంకేతిక సమస్యలు తలెత్తినా వెంటనే విద్యుత్తును పునరుద్ధరిం చేందుకు ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ వెహికల్స్ ను అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్రంలో అవసరమైన చోట్ల 244 కొత్త సబ్ స్టేషన్లను నెల కొల్పుతోందని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది.

# కులగణనతో పేదలకు న్యాయం

## తెలంగాణలో కాంగ్రెస్ వచ్చిందంటే అది గ్రామస్థాయి నాయకుల కృషి ఫలితమే

### పిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్

**హైదరాబాద్, నవంబరు 29 ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందంటే అది గ్రామ స్థాయి నాయకుల కృషి ఫలితమే అని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఇందిరా భవన్‌లో పంచాయతీ రాజ్ సంఘటన్ సమావేశం పాల్గొననున్న టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, అల్ ఇండియా ఛైర్మన్ హర్షవర్ధన్ సపకాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ అనుబంధ సంఘాల ఛైర్మన్‌లలో చాలా మంది కార్పొరేషన్ ఛైర్మన్‌లుగా చేసామన్నారు. సేవాదల్, ఆర్‌జిపిఆర్ఎస్‌లు రాహుల్ గాంధీకి చాలా ఇష్టమని, ది రాజీవ్‌గాంధీకి గ్రామ పంచాయతీలు అంటే ఇష్టం అన్నారు. 73, 74 రాజ్యాంగ సవరణ తోనే గ్రామాలకు హక్కులు వచ్చాయని, ఇది రాజీవ్ గాంధీచేసిన కృషి. మాజీ ప్రధాని పివి నర్సింహారావు వీటిని అమలు చేశారన్నారు.



దీని వల్లనే పంచాయితీలకు గౌరవం వచ్చిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీలను నిర్లక్ష్యం చేసిందని, బిల్లులు ఇవ్వకపోవడంతో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. కులగణన చాలా ముఖ్యమని, ఇది రాహుల్ గాంధీ ఆలోచన అన్నారు. దీని వల్లనే పేదలకు న్యాయం జరుగుతుంది. ఆధాని, అంబానీలను బిజెపి పెంచి పోషిస్తుందన్నారు. మన రాష్ట్రంలో కులగణన సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించడం హర్షనీయన్నారు. రాజీవ్, రాహుల్, సోనియాగాంధీలకు పదవుల మీద ఆశ లేదన్నారు.

పెద్దల కోసం ధన వంతుల కోసం బిజెపి పని చేస్తుందన్నారు. బిజెపి కేంద్రంలో ఇచ్చిన ఒక్క హామీ నెర వేర్చలేదు. ఈ దేశాన్ని ప్రైవేట్ పరం చేసేందుకు మోడీ కుట్ర చేస్తున్నారని, దేశాన్ని కాంగ్రెస్ కాపాడుతుంటే బిజెపి అమ్మేస్తుందని, కాంగ్రెస్ పార్టీలో పంచాయతీ సంఘటన్ చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో గెలవాలని, వ్యక్తుల ప్రభావం అధికంగా ఉండే పంచాయతీ ఎన్నికల్లో మీరు గెలవాలన్నారు.

సంస్థ ఇంకా బలోపేతం చెయ్యాలని, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇచ్చినప్పుడు జనం కెసిఆర్‌కు సిఎంగా అవకాశం ఇచ్చారన్నారు. బంగారు తెలంగాణ అని ప్రజలను మోసం చేశారన్నారు. కెసిఆర్ కుటుంబం బంగారు కుటుంబంగా మారిందన్నారు.

# ప్రధాని భద్రతా వలయంలో మహిళా కమాండో?

**న్యూఢిల్లీ, నవంబరు 29:** దేశప్రధాని నరేంద్రమోడీ భద్రతా వలయంలో మహిళా కమాండోలు కూడా ఉన్నారా అంటే ఉన్నారన్నట్లుగానే ఒక మహిళా కమాండో కనిపించింది. పార్లమెంట్‌వద్దప్రధాని నడుస్తుండగా ఆయన వెనక ఒక మహిళా కమాండో కనిపించారు. ఈ చిత్రాన్ని బిజెపి ఎంపి కంగనా రనౌత్ తన ఇన్‌స్టాస్టోరీలోపోస్టుచేసారు. దీనితో ఈ ఫోటో మరింతగా వైరల్ అయింది. ఆమె ప్రధాని భద్రతా గ్రూప్ ఎస్పీజీ సభ్యురాలే అయి ఉంటుందని అందరూ కామెంట్లు పోస్టుచేసారు. దీనిపై భద్రతా వర్గాలుక ఊడా స్పందించాయి. కొందరుమహిళా ఎస్పీజీ కమాండోలు క్లోజ్‌ప్రొటెక్షన్ టీమ్‌లో సభ్యులుగా ఉంటారని తెలిపారు. అయితే ఈ మహిళ మాత్రం ఎస్పీజీ బృందంలోకాదని, ఆమె రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కేటాయించిన పర్సనల్‌సెక్యూరిటీ అధికారిణి అని తెలిపాయి. సిఆర్‌పిఎఫ్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా వ్యవహరిస్తున్నట్లు ఎస్పీజీ వివరణ ఇచ్చింది. 1984లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ హత్య జరిగిన తర్వాత ప్రధానులు వారి కుటుంబాల భద్రతకోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేయాలని ఆనాటిప్రభుత్వం నిర్ణయించింది ఈ క్రమంలోనే 1985లో ఎస్పీజీ ఏర్పాటయింది. ప్రస్తుత మాజీ ప్రధానులు, వారి సమీప కుటుంబసభ్యుల భద్రతను ఈ బృందం పర్యవేక్షిస్తుంది. తర్వాత మార్పులు వచ్చాయి. ఇపుడుక ఏవలం పదవిలో ఉన్న ప్రధాని ఆయన కుటుంబసభ్యులకు మాత్రమే ఈ భద్రత లభిస్తుంది.



# భూసేకరణ రద్దు ప్రకటన హర్షణీయం

## ఇది వామపక్షాల పోరాట ఫలితమే

### సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్, నవంబరు 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో ఫార్మాసిటీ కొరకు ఆగస్టు 1వ తేదీన జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవడంపై సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఉత్తర్వులను వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రభుత్వం శుక్రవారం ప్రకటించడంతో హర్షం వ్యక్తంచేస్తున్నట్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. మొత్తం 580మంది రైతులకు చెందిన 632 ఎకరాల భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయడానికి వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగిన పోరాటమే కారణమని, ఇది లగచర్ల ప్రాంత ప్రజల విజయమని పేర్కొన్నారు. భూసేకరణ ప్రజాభిప్రాయం సందర్భంగా లగచర్ల వెళ్లిన అధికారులు, రైతుల మధ్య జరిగిన తోపులాట, ఘర్షణ ఫలితంగా ప్రభుత్వం ఆ ప్రాంతంలో నిర్బంధం విధించింది. దీంత ఈ నెల 21న 10 వామపక్ష పార్టీల రాష్ట్ర బృందం లగచర్ల, సమీప గ్రామాలను సందర్శించి ప్రజలనుంచి అనేక విషయాలు తెలుసుకొన్నట్టు చెప్పారు. ఈ నెల 23న రాష్ట్ర ముఖ్యమంత్రిని కలసి అక్కడ పరిస్థితులను వివరిస్తూ వినతి పత్రం సమర్పించామని.. వెంటనే ముఖ్యమంత్రి స్పందించి తక్షణమే ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారని తమ్మినేని గుర్తు చేశారు.

# విజయోత్సవాలు కాదు.. అబద్ధాల విజయోత్సవాలు

## బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

**హైదరాబాద్, నవంబరు 29, ప్రభాతవార్త:** కాంగ్రెస్ సర్కారు యేడాది పాలనపై జరుపుకోవాల్సింది విజయోత్సవాలు కాదు, అబద్ధాల విజయోత్సవాలని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఫసల్ భీమా యోజన పథకాన్ని అమలు చేయకపోవడంతో ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు వేలకోట్ల రూపాయలు నష్టపోతున్నారని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు అభయహస్తం పేరుతో విడుదల చేసిన మేనిఫెస్టోలో వివిధ రకాల రైతు హామీలు ఇచ్చారు. ఇప్పటి వరకు అమలు కాలేదన్నారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో డిసెంబర్ 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఉద్యమించేలా కార్యక్రమాలు చేపడు తామన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో రైతుల కు జరిగిన అన్యా యాన్ని వివరిస్తామన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఊ అంటే ఫాంఆయిల్ గురించే మాట్లాడుతున్నాడు. కానీ, కేంద్రం ఇస్తున్న రూ.10,500 సబ్సిడీ గురించి మాత్రం చెప్పడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఎరువుల మీద ఎకరాకు రూ.18వేల సబ్సిడీ అందిస్తుందన్నారు. ఉత్పత్తిని పెంచి రైతుల ఖర్చును తగ్గించడానికి నానో యూరియా, డిఎపి ఇస్తోందన్నారు. చిరుధాన్యాలను ప్రోత్సహించడానికి ఆర్థికసహకారం అందించే ప్రయత్నం నరేంద్రమోదీ ప్రభుత్వం చేస్తోందన్నారు. గత పది సంవత్సరాలలో ధాన్యానికి రూ.1000 పైగా మద్దతు ధరలు పెంచింది. కానీ ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయ్యింది. కేంద్రం ఇంత అభివృద్ధి చేస్తున్నా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు వాళ్లే చేస్తున్నట్టు గప్పాలు కొట్టుకోకుండా కేంద్ర ప్రభుత్వం చేసే అభివృద్ధిని స్వాగతించాలన్నారు.



# ఢిల్లీలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క బిజీబిజీ

## కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి హాజరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 29:** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు శుక్రవారం ఢిల్లీలో బిజీబిజీగా ఉన్నారు. అక్కడ జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. కాగా, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమిని అధికారంలో కి తీసుకొచ్చేందుకు విశిష్ట కృషి చేసిన ఏఐసీసీ పరిశీలకుడు, స్టార్ క్యాంపెయినర్, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లును జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ అభినందించారు. రాంచీలో సీఎంగా సోరెన్ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఏర్పాటు చేసి నభారీ బహిరంగ సభ అనంతరం.. ఏర్పాటు చేసిన హై..టీ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను అభినదించారు. తర్వాత శుక్రవారం జర్కాండ్ నుంచి భట్టి విక్రమార్క నేరుగా ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు సిఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లాల్సి ఉన్నప్పటికీ తన పర్యటనను రద్దు చేసుకున్నారు. హైదరాబాద్‌లోనే ఉండి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు, మహబూబ్‌నగర్‌లో రైతు సభ ఏర్పాట్లు, ఇతరత్రా పలు అంశాలపై సమీక్ష చేశారు.

# ఐటీ ఉద్యోగాల సాధనపై టి- సాట్ స్పెషల్ లైవ్ ప్రోగ్రామ్‌లు

## నేటి నుంచి ఏప్రిల్ 26 వరకు ప్రసారాలు కొనసాగింపు

### టి- సాట్ సీఈవో వేణుగోపాల్ రెడ్డి

**హైదరాబాద్, నవంబరు 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఐటీ ఉద్యోగాల సాధన కోసం టి-సాట్ ప్రత్యేకంగా లైవ్ ప్రోగ్రామ్స్‌ను నిర్వహించనుంది. లైవ్ ప్రోగ్రామ్స్‌ను 5 నెలల పాటు కొనసాగించనున్నట్టు టి-సాట్ సీఈవో వేణుగోపాల్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ఐటి శాఖ ఆధ్వర్యంలో ఐటి ఉద్యోగుల కోసం వీఎల్ఎస్ఐ అవేర్ నెస్ ప్రొగ్రాం పేరిట ఐదు నెలల పాటు ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాలుంటాయని బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ప్రకటించారు. నేటి నుంచి ఏప్రిల్ 26 వరకు ప్రసారాలు కొనసాగుతాయని తెలిపారు. ఉదయం 10 నుండి 12 గంటల వరకు ప్రతి శనివారం టిసాట్ నిపుణ ఛానల్ లో మరుసటి రోజు ఆదివారం సాయంత్రం విద్యా ఛానల్ లో ఏడు నుండి ఎనిమిది గంటలకు ప్రసారమోతాయని, 5 నెలల పాటు కొనసాగే షెడ్యూల్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలని సీఈవో వేణుగోపాల్ రెడ్డి సూచించారు. పీవీసీపొటానిక్స్ వ్యాలీ కార్పోరేషన్(పీవీసీ), టాస్క్‌తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్), ఎఎస్ఐపిఅడ్వాన్స్డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజ్ టెక్నాలజీస్(ఏఎస్ఐపీ), తెలంగాణ స్కిల్ అకడమిక్ అండ్ ట్రైనింగ్(టి-సాట్) సంయుక్తంగా డిజైన్ చేసిన కోర్సులను ప్రత్యేక ప్రత్యక్ష ప్రసారం అందిస్తున్నట్టు తెలిపారు. ఐటీ ఉద్యోగాల కల్పనపైనా ప్రత్యేక అవగాహన కార్యక్రమాల ప్రసారాలు చేసేందుకు కార్యక్రమాలు రూపొందించినట్టు తెలిపారు. ఐటి ఉద్యోగాల్లో ప్రధాన భూమిక పోషించే చిప్ డిజైనింగ్, ప్రొడక్షన్ కోర్సులలో నిరుద్యోగ యువతకు ప్రత్యేక అవగాహన కల్పించాలని ఈ ప్రత్యేక ప్రసారాలు చేస్తున్నట్లు వేణుగోపాల్ రెడ్డి వివరించారు. రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులతో పాటు పాలిటెక్నిక్, డిగ్రీ విద్యార్థులకూ ఈ ప్రసారాలు ఉపయోగపడతాయని, ప్రతి యేటా ఇంజనీరింగ్ విద్యలో నాల్గవ సంవత్సరం పూర్తి చేసే సుమారు 3,00,000 లక్షల మంది విద్యార్థులకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

# రామప్ప, సోమశిల పర్యాటక సర్క్యూట్ల కింద రూ.142 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం

## ఎస్ఎఎస్‌సిఐ పథకం కింద కేటాయింపు

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హర్షం

**హైదరాబాద్, నవంబరు 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి ఎస్ఎఎస్‌సిఐ పథకం కింద రూ.142కోట్ల రూపాయలను కేంద్రం కేటాయింపులు చేసింది. రూ. 142 కోట్లతో రామప్ప, సోమశిల పర్యాటక సర్క్యూట్లను కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించిన సందర్భంగా కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. భారత పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా ప్రధానమంత్రి నరేంద్రమోడి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్/యూనియన్ టెరిటరీస్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్ (ఎస్ఎఎస్‌సిఐ) పథకం కింద ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయడం కోసం 23 రాష్ట్రాలలోని 40 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. రూ.3,295.76 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టులకు 50 సంవత్సరాల కాలవ్యవధితో వడ్డీరహిత రుణాలు అందించనున్నారు. స్థానిక ఆర్థిక వ్యవస్థలకు ప్రోత్సాహం లభిస్తుందని, సుస్థిరమైన పర్యాటకంతో ఉపాధి సృష్టి జరుగుతుందని తెలిపారు. తెలంగాణా నుంచి సస్టెయినబుల్ టూరిజం సర్క్యూట్ (సుస్థిర పర్యాటక సర్క్యూట్స్) కింద రూ. 74 కోట్లతో రామప్పకు, వెల్‌నెస్ స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల కింద రూ. 68 కోట్లతో సోమశిల ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

ప్రజల ఆదరణ పొందిన ఆయా పర్యాటక ప్రాంతాలలో రద్దీని తగ్గించడం, అధునాతన సాంకేతికతలను సమర్థవంతంగా ఉపయోగించడం, స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి, సందర్శకుల అనుభవాలను మెరుగుపరచడానికి ప్రభుత్వ,ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వరకు, భారతదేశం సహజమైన సాంస్కృతిక, చారిత్రక వైభవాన్ని అనుభూతి చెందాలనుకునే ప్రతి ఒక్కరికీ ప్రపంచ స్థాయి అనుభవాన్ని అందించడానికి అనేక రకాల చర్యలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

గతంలో సైతం కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అనేక చారిత్రక, పర్యాటక ప్రాంతాలను నరేంద్రమోదీ ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి చేసిందని, ప్రధానంగా స్వదేశ్ దర్శన్ పథకం కింద రూ.92 కోట్లతో సోమశిల, సింగోటం, కదళీవనం, అక్కమహాదేవి, ఈగలపెంట, ఫరాహాబాద్, ఉమామహేశ్వరం, మల్లెలతీర్థం మధ్య ఎకో సర్క్యూట్‌ను అభివృద్ధి చేసిందన్నారు. ప్రసాద్ పథకం కింద రూ.62 కోట్లతో రామప్ప ఆలయం అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, వీటితో పాటుగా స్వదేశ్ దర్శన్ పథకం కిందనే రూ.80 కోట్లతో ములుగు, లక్నవరం, మేడవరం, తాడ్వాయి, దామరవాయి, మల్లూరు, బొగత వాటర్ ఫాల్స్‌లను కలుపుతూ గిరిజన సర్క్యూట్ ను రూ.97 కోట్లతో కుతుబ్ షాహీ హెరిటేజ్ పార్క్, పైగా టూంబ్స్, హయత్ బక్షి మసీదు, రేమండ్స్ టూంబ్స్ కలుపుతూ హెరిటేజ్ సర్క్యూట్ ను నరేంద్రమోడి ప్రభుత్వం అభివృద్ధి చేసిందని, ప్రసాద్ పథకం కింద రూ.42 కోట్లతో భద్రాచలం రాముల వారి ఆలయం, రూ.37 కోట్లతో ఆలంపూర్ జోగులాంబ ఆలయం, రూ.4.5 కోట్లతో బల్కంపేట ఎల్లమ్మ ఆలయాల అభివృద్ధికి నిధులు విడుదల చేసి వేగవంతంగా అభివృద్ధి పనులను చేపడుతుందన్నారు. ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

వీటితోపాటుగా స్వదేశ్‌దర్శన్ 2.0 పథకం కింద రూ.57 కోట్లతో భువనగిరి కోట అభివృద్ధి, రూ.38 కోట్లతో అనంతగిరి ఎకో టూరిజం ప్రాజెక్టులను, ఛాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ డెవలప్‌మెంట్ (సిబిడిడి) పథకం కింద రూ.25 కోట్లతో నల్గొండ కల్చర్ హెరిటేజ్ ప్రాజెక్టు, రూ.10 కోట్లతో కామారెడ్డి (కల్కి చెరువు) ఎకో టూరిజం ప్రాజెక్టులను తెలంగాణకు మంజూరు చేశామని, ఇవే కాకుండా వరంగల్ కోట, గోల్కొండ కోట వంటి చారిత్రక కట్టడాలకు, ఉస్మానియా యూనివర్సిటీ, ట్యాంక్ బండ్‌లకు సౌండ్ ఇల్యూమినేషన్, లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు, నాగార్జున సాగర్‌లో బుద్ధవనం ప్రాజెక్టుకు నిధులు, వేయిస్తంభాల గుడి అభివృద్ధి, సంగీత నాటక అకాడమి ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు, ఎపిగ్రఫి మ్యూజియం, మింట్ మ్యూజియం, కొమురం భీమ్ గిరిజన మ్యూజియం ఏర్పాటు వంటి అనేక రకాల చర్యలను చేపట్టి తెలంగాణ సాంస్కృతిక, చారిత్రక, పర్యాటక వైభవాన్ని ప్రజలకు, భవిష్యత్ తరాలకు తెలియజేయడానికి నరేంద్రమోదీ ప్రభుత్వం తనవంతు కృషి చేస్తోందన్నారు.

